

# 'ప్రజా రక్షణ భేరి'ని జయప్రదం చేయండి

## - సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ - సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార జాతాలు

**ప్రజాశక్తి - ఆదోని**

అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈనెల 30న ఆదోని నుంచి చేపట్టే సిపిఎం 'ప్రజా రక్షణ భేరి' రాష్ట్ర బస్సుజాతాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి కోరారు. గురువారం ఆదోనిలోని కల్లుబావిలో ఆటో జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పిన పాలక పార్టీలు ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. జిల్లా నుంచి రాజకీయంగా అత్యున్నత పదవులు పొందినా జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని తెలిపారు. జిల్లాలో ఒక్క భారీ పరిశ్రమ కూడా లేదన్నారు. జిల్లా సాగునీరు, పారిశ్రామిక రంగం, విద్యలో వెనుకబాటు తనంతో ఉందని తెలిపారు. గత 75 ఏళ్లుగా దేశాన్ని, రాష్ట్రాన్ని పాలిస్తున్న పాలకులకు జిల్లా అభివృద్ధి పట్టడం లేదని విమర్శించారు. అసమానతల్లేని అభివృద్ధి కోసం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, యువతకు ఉపాధి, జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిధుల సాధనకు సిపిఎం ఆధ్వర్యంలో 30న రాష్ట్ర బస్సు జాతా ఆదోనిలో ప్రారంభమవుతుందని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, నాగేంద్ర, నాగరాజు, వెంకటేష్, అజీమ్ ఖాన్, నాయకులు రాజు, ఈరన్న, మల్లయ్య, తిమ్మయ్య పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం పెద్దతుంబలం గ్రామం నుంచి జీపు జాతాను ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు మాట్లాడారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ యాత్ర ప్రారంభ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ హాజరవుతారని తెలిపారు. పెద్దతుంబలం, కుప్పగల్లు, బల్లేకల్లు, పాండవగల్లు, గనేకల్లు, జాలమంచి, దొడ్డనకేరి, కొత్తూరు, మాంత్రికి, సుల్తానాపురం, పెసలబండ, కపటి, నాగలాపురం, ఆరేకల్లు గ్రామాల్లో జీపుజాతా సాగింది. సిపిఎం మండల కార్యదర్శి లింగన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వీరారెడ్డి, ఎం.ఉచ్చీరప్ప, మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, శేఖర్ పాల్గొన్నారు. **దేవనకొండ**, పల్లెదొడ్డి, వెంకటాపురం, నేలతలమర్రి, గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బంటుపల్లి, బేతపల్లి, పొట్లపాడు, కుంకనూరు గ్రామాల్లో ప్రచార జాతా సాగింది. మండలంలో సాగునీటి సమస్య పరిష్కారం కోసం, పంట కాలువల నిర్మాణం, కరువు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం మండల కమిటీ ఆధ్వర్యంలో దేవనకొండ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆటో జాతాను సిపిఎం సీనియర్ నాయకులు బజారి జెండా ఊపి ప్రారంభించారు. మండల కమిటీ సభ్యుల అశోక్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల నాయకులు సూరి, మహబూబ్ బాష మాట్లాడా రు. సిపిఎం నాయకులు సుంకన్న, శ్రీనివాసులు, కౌలుట్ల స్వామి, నాగరాజు, వీరన్న, విజయ్ పాల్గొన్నారు. **ఆస్పరిలో** సిపిఎం ఆధ్వర్యంలో జీపుజాతాను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, కెవి.నారా యణ ప్రారంభించారు. మండలంలోని శంకర బండ, చిరుమాన్ దొడ్డి, హలిగేరి, చిగిలి, నగరూరు, బిణిగేరి, తంగరడోణ, తురువగల్లు, తోగలగల్లు, దొడగొండ, బైలు పత్తికొండ, గార్లపెంట, డి.కోటకొండ, కారుమంచి, ములుగుందం, పలుకురబండ గ్రామాల్లో జీపు జాతా సాగింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు, మండల నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, సీనియర్ నాయకులు మాణిక్యప్ప, రంగప్ప, మధు రెడ్డి, చిన్న మల్లేష్, డివైఎఫ్ఐ నాయకులు మురళీ, నవీన్, సిపిఐ నాయకులు ఉరుకుందప్ప, ఉరుకుంద పాల్గొన్నారు. **కోసిగి** బస్టాండ్ దగ్గర సిపిఎం ఆటో జాతాను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు పారంభించారు. సిపిఎం మండల నాయకులు రాముడు, నాగేంద్ర, ముక్కరన్న, రాము, చిన్నా రెడ్డి పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న రాధాకృష్ణ



ఆదోనిరూరల్ : మాట్లాడుతున్న వెంకటేశులు



ఆస్పరిలో జీపుజాతాను ప్రారంభిస్తున్న రామాంజనేయులు, నారాయణ



విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

# నవంబర్ 10లోపు ప్రక్రియ పూర్తి

**- కలెక్టర్ డాక్టర్ సృజన**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను నవంబర్ 10లోపు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఈవిఎం గోడౌన్‌లో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవిఎంలను విడివిడిగా భద్రపరచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈవిఎంల నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

# తల్లి, కూతురుపై పోకిరి దాడి

**- ప్రేమ వ్యవహారమే దాడికి కారణం..?**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ఎమ్మిగనూరులో తల్లీకూతురుపై ఓ పోకిరి దాడి చేశాడు. పట్టణంలోని అన్నమయ్య కూడలి దగ్గర ఓ పోకిరి బిటెక్ రెండో సంవత్సరం చదువుతున్న మధుప్రియ అనే యువతిపై కర్రతో దాడి చేశాడు. అడ్డుకున్న తల్లిపై కూడా దాడికి పాల్పడ్డాడు. దాడిలో తల్లి విజయలక్ష్మి, కూతురు మధుప్రియ తలకు గాయాలయ్యాయి. దాడిని గమనించిన స్థానికులు పోకిరిని చుట్టుముట్టి చితకబాదారు. నిందితుడు పెద్దకడబూరు మండలం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన చిరంజీవి ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. గత కొన్ని నెలలుగా మధుప్రియను ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. బాధితులు ఇప్పటి వరకు ఫిర్యాదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు. విజయలక్ష్మిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి

# బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-పత్తికొండ**

పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయంలో నూతన ఆర్‌డిఒగా నీలపు రామలక్ష్మి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌డిఒ రామలక్ష్మిని అడ్మినిస్ట్రేటివ్ అధికారి సతీష్ కుమార్ పుష్పగుచం అందజేసి స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ రామలక్ష్మి

**కలెక్టర్‌ను కలిసిన పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి**

కర్నూలు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ను పత్తికొండ నూతన ఆర్‌డిఒ రామలక్ష్మి గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పత్తికొండ అభివృద్ధిపై పలు విషయాలు చర్చించినట్లు సమాచారం.

# రామేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దాం

**- అంతిమయాత్రలో పలువురు నేతలు**

**ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్**

నీలం రామేశ్వరరావు ఆశయాలు కొనసాగిద్దామని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, రిటైర్డ్ పోలీస్ అధికారి ముత్యాలనాయుడు, డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఇరిగినేని పుల్లారెడ్డి, నరసింహ, కార్మిక నాయకులు కర్నూల్ నగరం లోని ఆయన ఇంటి వద్దకు వెళ్లి మృతదేహంపై పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన మతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బంధుమిత్రుల ఆధ్వర్యంలో నీలం రామేశ్వరరావు అంత్యక్రియలు గురువారం కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో నిర్వహించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు టి.శేషపని, వామపక్ష ఉద్యమ నాయకులు వనపర్తి రాజు, గ్రామ నాయకులు జయన్న గౌడ్, సుంకులన్న బంధుమిత్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

# ఆయుధాల ప్రదర్శనను ప్రారంభించిన ఎస్‌పి

**విద్యార్థులకు అవగాహన- నేడు, రేపు ప్రదర్శన**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

పోలీసుల ఆయుధాల ప్రదర్శన ఓపెన్ హౌస్‌ను కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంతు గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పేరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతీ ఏటా అమరవీరుల పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమం రెండు రోజులపాటు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శిస్తామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్ పరికరాలు, పాల్కన్ వాహనంను ఓపెన్ హౌస్ కార్యక్రంలో భాగంగా ప్రదర్శనలో ఉంచారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఈనెల 26, 27 రెండు రోజుల పాటు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, చూసి అవగాహన పెంచుకోవాలని ఎస్‌పి తెలిపారు. పోలీసు వ్యవస్థ పనితీరు గురించి , పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాల గురించి కళాశాల, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. పోలీసు శాఖలో చేరే విధంగా ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో, యువతలో ఉత్సాహాన్ని కల్పిస్తున్నామన్నారు. ఓపెన్ హౌస్ లోని ఆయుధాల గురించి విద్యార్థులకు జిల్లా ఎస్‌పి ఆర్‌ఐలు అవగాహన కల్పించారు. ఎలాంటి సందర్భంలో ఏ ఆయుధాన్ని వినియోగిస్తారని, వాటి పని తీరు గురించి అవగాహన కల్పించారు.



ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

**ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు....**

డాగ్ స్క్వాడ్ బృందాలు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్, హెచ్ హెచ్ ఎండి గ్యారెట్, డిఎస్ఎండి గ్యారెట్, ఎక్స్ ప్లోజివ్ డిటెక్టర్ , డ్రాగన్ లైట్ , ప్రోడర్, బాంబు డిస్పోజల్ టీం , ఎక్స్ టెన్షన్ మిర్రర్ , బాంబు సూట్, వెహికల్ ఇన్ స్పెక్షన్ మిర్రర్, బాంబ్ బ్లాంకెట్ , బాంబ్ షీల్డ్, లెడిష్ ఎన్ క్లోజర్, 410 మస్కెట్ , 22 రైఫిల్, ఎల్ ఈ ఇన్ ఫీల్డ్ షార్ట్ మాగజైన్ , 303 జిఎఫ్ రైఫిల్, 12 బోర్ పంప్ యాక్షన్ గన్, 7.62 ఎంఎంఎస్ఎల్ఆర్ , 7.62 ఎంఎంఎఫ్ఎల్, ఎకె 47 రైఫిల్, యుబిజిఎల్, 5.56 ఇన్సాస్ రైఫిల్, 9 ఎంఎం. కార్బైన్, 380 రివాల్వర్, 9 ఎంఎం పిస్టోల్, గ్లాక్ పిస్టల్, విఎల్ పిస్టోల్, 303 రైట్ గన్, 1.5 ఫెడరల్ గ్యాస్ గన్, 38 ఎంఎం మల్టీ సెల్ లాంచర్, 51 ఎంఎం మోర్టర్ , ఇన్ స్ట్రక్షనల్ గ్రానైడ్, ఫైబర్ లాఠీ, బిపి జాకెట్, స్టోన్ గార్డు, హెల్మెట్, బాడీ ప్రొటెక్టర్ , 303 ఎల్ఎంజి, 7.62 ఎంఎంఎల్ ఎమ్ జి , పాల్కన్ వాహనం, తదితర ఆయుధాలను ప్రదర్శనలో ఉంచారు. సిస్టర్ స్టానిస్లాస్ మెమోరియల్ స్కూల్, కెవిఆర్ కళాశాల, మాంటిస్సోరి స్కూల్, సెయింట్ జోసఫ్ స్కూల్, రవింద్ర విద్యానికేతన్ స్కూల్, లిటిల్ కాలర్స్ స్కూల్, ఐడియల్ స్కూల్, అథీనా స్కూల్ , శ్రీ లక్ష్మీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ శ్రీనివాస రెడ్డి ,ఆర్ ఐలు రమణ, పోతు రాజు, ఆర్ ఎఎస్ఐలు, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్ పోలీసు సిబ్బంది ఉన్నారు.



# పనులను పరిశీలించిన కమిషనర్

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

నగర పాలక కమిషనర్ ఎ.భార్గవ్ తేజ గురువారం ఇంజినీరింగ్ విభాగ అధికారులతో నగరంలో జరుగుతున్న వాల్ మార్ట్ ఏరియాలోని స్మార్ట్ స్ట్రీట్ అభివృద్ధి పనులు, గుత్తి ఫ్లైఓవర్ వెండర్ జోన్ పనులు, ఐటిసి వెండర్ జోన్ పనులు, వెంకటాద్రి నగర్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించిన కమిషనర్ , పనులను ప్రణాళిక ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో కమిషనర్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్, డిఇ నరేష్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# హార్మోనిస్ట్ రామలింగంకు ఘన సన్మానం

**ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్**

బంగారు వీణ గ్రహీత రామలింగంను కళాకారులు ఘనంగా సత్కరించారు. కర్నూలు నగరంలోని చెన్నమ్మ సర్కిల్లో ఉన్న రైతు కళానిలయంలో గురువారం ఉదయం కర్నూలు కళాకారుల సేవా కేంద్రం హనుమాన్ కళా సమితి సంయుక్తంగా సంగీత గురువులు యు.రామలింగంను శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ శ్రీకళానికేతన్ వారిచే ప్రదర్శించిన పద్యనాటికం వసంత రాజ్యం ప్రథమ బంగారు వీణ అవార్డు , తిరుపతి హనుమ అవార్డ్స్ ప్రదర్శనలో ద్వితీయ రజిత హనుమ అవార్డు యు.రామలింగం సంగీత దర్శకత్వంలో రాష్ట్రస్థాయి బహుమతులు లభించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సన్మానకార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా హనుమాన్ కళా సమితి అధ్యక్షులు పెరికలపాటి హనుమంతరావు చౌదరి, విశ్రాంతి తహశీల్దార్ సిబి అజయ్ కుమార్ లు ప్రశంసించారు. వసంత రాజ్యం నాటకంలో ప్రత్యేక పాత్రధారిగా పోషించిన లక్ష్మణ రాజును సైతం కళాకారులు ప్రశంసించారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో బహుమతులు జాతీయస్థాయిలో అందుకోవాలని కోరారు.

# 'రాజ్యాంగం - మనువాదం' జిల్లా సదస్సు కరపత్రాల విడుదల

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

ఈనెల 29న ఎమ్మిగనూరు పట్టణం తేరు బజార్ లో ఉన్న పద్మశాలి కమ్యూనిటీ హాలులో రాజ్యాంగం మనువాదం అనే అంశంపై జరుగుతున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. గురువారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్‌లో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణ, డి.విజయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఎ.గురుస్వామి, ఎం .భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.హనుమంతు లు జిల్లా సదస్సు కరపత్రాలను విడుదల చేశారు.ఆనంద్ బాబు మాట్లాడుతూ.. నేటికీ దళితులు దారుణమైన అవమానాలను భరిస్తూనే బతుకుతున్నారన్నారు. భారత రాజ్యాంగంలో అనేక రకాల హక్కులు పొందపరిచినప్పటికీ, నాటినుండి నేటిదాకా అధికారంలో ఉన్న పాలకుల కారణంగా అవి అమలుకు నోచుకోలేదన్నారు. ప్రస్తుత బిజెపి పరిపాలన క్రమంలో రాజ్యాంగ మౌలిక స్వరూపానికే విఘాతం కలిగే ప్రమాదం ఏర్పడిందన్నారు. తరతరాలుగా అంటరానితనాన్ని భరిస్తూ వస్తున్న అసమానులకు ప్రత్యేక అవకాశాలు కల్పించడానికి బదులు, అందరికీ సమానమైన అవకాశాల పేరుతో.. నిండిన వారికే మరింత నింపి పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ క్రమంలో 29న ఎమ్మిగనూరులో జిల్లా స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.



సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న కెవిపిఎస్‌నాయకులు

# అసమానతలు లేని అభివృద్ధికి ప్రజారక్షణభేరి



**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

అసమానతలు లేని అభివృద్ధికొసం సిపిఎం ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్ ప్రజలను కోరారు. ప్రజారక్షణభేరి విజయవంతానికి కర్నూలు నగరంలోని, ఒకటో వార్డు ఖండేరి లోని ఎల్కూరు గేటు, నవాబ్ బంగ్లా, చాకలి వీధి, క్వాటర్స్, శంకర మందిరం ,లక్ష్మందాస్ వీధి , కురువ వీధి ,పాత బస్టాండ్ లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పైన, ప్రచారం నిర్వహించారు. ఈనెల 30న బస్సుజాత రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల నుండి ప్రారంభిస్తున్న సందర్భంగా అదే రోజు ఆదోనిలో ప్రారంభమైన బస్సు జాత సాయంత్రం కర్నూలు పాత బస్టాండ్‌కు చేరుకుంటున్న సందర్భంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు చెప్పడానికి ఈ సభను ఏర్పాటు చేశారన్నారు.నాయకులు గౌస్ బాష ,గనీఖాన్ ,మద్దిలేటి, శ్రీనివాసులు, గోపాల్ ,అనిల్, వెంకటేశ్వర్లు ,సతీష్ , ఫిలాబ్ పాల్గొన్నారు.

**హామీలను నెరవేర్చే పార్టీలను ఎన్నుకోవాలి**

**కర్నూలు హాస్పిటల్** : ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని సిపిఎం నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అసమానతలు లేని రాష్ట్ర అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజారక్షణభేరి బస్సు యాత్ర ను జయప్రదం చేయాలన్నారు. 33వ వార్డు కల్లూరు, 31 వార్డు శరీన్ నగర్ లలో సిపిఎం ప్రచార యాత్ర నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు జి.ఏసు, కల్లూరు కార్యదర్శి జె శ్రీనివాసులు మాట్లాడారు.



## ఓటరు జాబితాపై ఆల్ పార్టీలతో ఆర్‌డిఒ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి

**ప్రజాశక్తి సి బెళగల్** : నియోజకవర్గంలోని అన్నీ పార్టీ నాయకుల, కార్యకర్తల సదస్సును ఎలక్టోరల్ జిల్లా అధికారి ఆర్‌డిఒ హరిప్రసాద్ గురువారం సి బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పుపై ఈ నెల 28, 29 న జిల్లా కేంద్రంలో సదస్సు ఉంటుందని అన్నీ పార్టీల నాయకులు తమ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని తొలగింపు, కొత్తగా చేర్పులు, వంటివి చేపట్టాలని అన్నారు. ఇకపై రానున్న ఎన్నికల్లో ఇంటివద్దనే ఓటు హక్కును వినియో గించుకొనేలా కొత్త విధానం రానుందని అందుకు అన్నీ పార్టీలు సహకరిస్తే సఫలం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషఫణి, ఎంపిడిఒ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ , వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు



# జగనన్న ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం : మేయర్

**బండిమెట్టలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని నగర మేయర్ బివై. రామయ్య పేర్కొన్నారు. గురువారం 4వ వార్డు బండిమెట్ట కుమ్మరి వీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. సురక్ష క్యాంపు సేవలపై అక్కడికి వచ్చిన రోగులతో మేయర్ ముచ్చటించారు. మేయర్ మాట్లాడుతూ గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ రూపంలో, ఇప్పుడు సిఎం వైఎస్ జగన్ నాయకత్వంలో ఆరోగ్య సురక్ష రూపంలో వైఎస్ కుటుంబం రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థకు జీవం పోశారన్నారు. ప్రస్తుతం జీవనశైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో ముందుగానే వాటిని గుర్తించి సరైన వైద్యాన్ని వైసిపి ప్రభుత్వం అందిస్తుందని కొనియాడారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ స్టాయీ సంఘ సభ్యులు, కార్పొరేటర్ అర్షియా ఫర్హిన్, క్యాంపు ఇంచార్జ్ డాక్టర్ టి.అపర్ణ, వార్డు ఇంచార్జ్ రియాజ్ బాబా, నాయకులు ఎంఏ. మోయిన్ బాష, అకీఫ్ నవాజ్, సనా, మాభూసా, ఫజిల్, అబిద్, చున్ను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవాలి : కెఇ. శ్యాంబాబు

**ప్రజాశక్తి-పత్తికొండ**

ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలు ఎండిపోయాయని, రబీ సీజన్‌లో అరకొర వర్షాలకు వేరుశనగ వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కెయి. శ్యాం బాబు డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండ మండలం పరిధిలోని జూటూరు గ్రామంలో ఆముదం, బుడ్డలు, కంది మిరప తదితర పంట పొలాలను టిడిపి నాయకులతో కలిసి కెఇ. శ్యాంబాబు పరిశీలించారు. సాగుచేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆముదం, మిరప, ఉల్లి తదితర పంటలను ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి పెట్టారని, తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పంట పొలాలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, ఈశ్వరప్ప, మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, జూటూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న శ్యాంబాబు

## అందరి సహకారంతో అభివృద్ధి

**- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి**

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్రీవిద్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ 90 శాతం సంక్షేమ పథకాలు అందజేశామని తెలిపారు. మండలంలోని ఆర్అండ్బి రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయించామని, పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**ముస్లింల షాదీఖానా ప్రారంభం**

పెద్దకడబూరు మండల పరిషత్ కార్యాలయం పక్కన సిఎండిఎఫ్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన నూతన షాదీఖానా భవనాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. మాజీ విఆర్ఒ రామలింగారెడ్డితో కలిసి రిబ్బన్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముస్లింలకు ముఖ్యమంత్రి జగన్ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ముస్లింల షాదీఖానాకు సిఎండిఎఫ్ నిధులు రూ.35 లక్షలు మంజూరు చేయించి నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. వైసిపి నేతలు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఎంపిపి శ్రీవిద్య, జడ్‌పిటిసి రాజేశ్వరి, సర్పంచి రామాంజనేయులు, అధికారులు నాగేశ్వరరావు, వీరేంద్ర గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## టిడిపి అధికారంలోకి రావడం తథ్యం

**- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**



వివాహ వేడుకలో పాల్గొన్న వీరభద్ర గౌడ్

వచ్చే 2024లో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమని టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. గురువారం చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు నేమకల్లు మేకల రవి సోదరుని కుమార్తె వివాహానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వీరభద్ర గౌడ్ మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి లేక వెనుకబడిందని, చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. అక్రమ కేసుల్లో చంద్రబాబును జైలులో పెట్టించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం కోసం ప్రజలు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. టిడిపి నాయకులు లాయర్ షేక్షావలీ, పాముల సన్నప్ప, భోగేష్, జనార్ధన్ స్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి పెద్దపీట : వైసిపి

**ప్రజాశక్తి - నందవరం**

పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైసిపి మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్, ఎంపిడిఒ దశరథ రామయ్య తెలిపారు. గురువారం నందవరంలో సచివాలయం-3లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. పేదలు ఖర్చు పెట్టుకోలేని రోగాలను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. డాక్టర్లు సౌజన్య, పరిమళ, చంద్రకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 9 గంటలు విద్యుత్ అందించాలి

**- సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు**

**ప్రజాశక్తి - మంత్రాలయం**



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పంట భూములకు 9 గంటల విద్యుత్‌ను సక్రమంగా అందించాలని రైతులు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. గురువారం మండలంలోని చెట్నహళ్లి, సూగూరు, బూదూరు, మాధవరం గ్రామాల రైతులు విద్యుత్ కోతలపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. వేసిన పంటలకు విద్యుత్ అధికారులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ 7 గంటలు మాత్రమే అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటల సమయంలో పొలాలకు విద్యుత్ అందించడం వల్ల ప్రస్తుతం ఉన్న ఎండలకు ఆ నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి తెల్లవారు జామున 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 9 గంటల విద్యుత్‌ను అందించాలని కోరారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్ఐ వేణుగోపాల్ రాజు సబ్ స్టేషన్‌ను చేరుకొని రైతులను శాంతింపజేశారు. అనంతరం విద్యుత్ శాఖ డిఇ విశ్వ శాంతి స్వరూప్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు.

రమణీయం..

# మాల మల్లేశ్వరుని రథోత్సవం

**ప్రజాశక్తి - హోళగుంద**



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీమాల మల్లేశ్వరుల రథోత్సవం రమణీయంగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక రాష్ట్ర భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండలంలోని నెరనికి, నెరనికి తండా, కొత్తపేట కొండ గుహలో వెలిసిన దేవరగట్టు శ్రీమాల మల్లేశ్వరుల రథోత్సవం వైభవంగా సాగింది. రథోత్సవం ముందు కోలాటాలు, బీరప్ప డోలు, నృత్యాలు వంటివి చూపర్లను ఆకట్టుకున్నాయి. రథోత్సవం తిరిగి 7 గంటలకు యథా స్థానానికి చేరుకోవడంతో భక్తులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**నిష్టతో మూడు గ్రామాల ప్రజల పూజలు**

మండలంలోని నెరనికి, నెరనికి తండా, కొత్తపేట ప్రజలు దేవరగట్టు దసరా ఉత్సవాల్లో భాగంగా నిష్టతో పూజలు చేస్తారు. 15 రోజులుగా మాంసాహారాన్ని స్వీకరించారు. భార్యాభర్తలు సైతం పవిత్రంగా ఉండి పూజలు చేస్తారు. ఈనెల 19న గణేష్ పూజతో ప్రారంభమైన ఉత్సవాలు, 24న (జైత్రయాత్ర) బన్నీ ఉత్సవం 25న భవిష్యవాణి, 26న రథోత్సవం, 27న గొరవయ్యల ఆట గొలుసు తెంపుట, దేవదాసులో నృత్యాలు జరుగుతాయి. 28న వసంతోత్సవంతో శ్రీమాల మల్లేశ్వర విగ్రహం మూర్తులు నెరనికి గ్రామం చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సిఐ వెంకటేశ్వర్లు, హోళగుంద ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

# బైలుప్పలో కూలీల వలస బాట

**- తెలంగాణకు వెళ్లిన కూలీలు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

వర్షాల్లేక, వేసిన పంటలు పండక బతుకు జీవుడా అంటూ పొట్టకూటి కోసం కూలీలు సుదూర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఇప్పటికే వేలాది మంది వ్యవసాయ కూలీలు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు వలస వెళ్లారు. గురువారం రాత్రి ఎమ్మిగనూరు పట్టణం ఎంజి.పెట్రోల్ బంక్‌లో ఓ బొలేరో వాహనం పిల్లాపాపలతో, మూట ముళ్ల సర్దుకొని జీవనోపాధి కోసం తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా చింతకుంటకు పత్తి తీయడానికి వలస వెళ్లారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామానికి చెందిన దాదాపు 22 మంది వ్యవసాయ కూలీలు ఇళ్లకు తాళాలు వేసి పత్తి పనులకు వెళ్లారు. వీరితో వారి పిల్లలను కూడా వెంట తీసుకెళ్లారు. ఇందులో కొంత మంది స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు కూడా ఉన్నారు.



బొలేరో వాహనంలో వెళ్తున్న కూలీలు

## గెస్ట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

**- ప్రిన్సిపల్ డాక్టర్ శివారెడ్డి**

**ప్రజాశక్తి - ఆదోని**




ఆదోనిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్, కామర్స్, బోటని సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపక నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శివా రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిజిలో 55 శాతం ఉత్తీర్ణత ఉన్న ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్లెట్ నెట్, పిహెచ్‌డి చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. నవంబర్ 2న ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9866041775 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

### డిఎన్‌టి హాస్టల్ వస్తువుల

## చోరీపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

**- నిందితులపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ**

**ప్రజాశక్తి- దేవనకొండ**

దేవనకొండలోని పాత డిఎన్‌టి హాస్టల్ భవనంలోని దూలాలు, ఇతర వస్తువుల చోరీపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాత డిఎన్‌టి హాస్టల్ వస్తువుల చోరీకి పాల్పడి అమ్ముకోవాలని చూడడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. నాయకులు అధికారం ఉంది కదా అని ఏం చేసినా చెల్లుతుందని వైసిపి నాయకులు అనుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. పదిమందికి విద్యాబుద్ధులు నేర్పిన భవనం వస్తువులను అక్రమంగా అమ్ముకోవాలని చూడడం దారుణమని తెలిపారు. డిఎన్‌టి హాస్టల్ బోర్డు పెట్టుకొని ఉన్న సదరు భవనంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. భవనాన్ని స్వాధీనం చేసుకోవాలనే బాధ్యత లేకపోవడం మండల అధికారులకు సిగ్గుచేటన్నారు. వెంటనే ఆ భవనాన్ని ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలన్నారు.

## ఇంట్లో చోరీ కోసం తలుపులకు నిప్పు

**- సమయానికి రావడంతో దొంగలు పరారీ**

**ప్రజాశక్తి - మంత్రాలయం**



తలుపులకు నిప్పు పెట్టిన దుండగులు

నందవరం తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కరణం జనార్ధన్ రావు ఇంట్లో చోరీ కోసం ఇంటి తలుపులకు దొంగలు నిప్పు పెట్టిన సంఘటన మంత్రాలయంలో చోటు చేసుకుంది. మంత్రాలయానికి చెందిన ఇంటి యజమాని జనార్ధన్ రావు స్థానిక మాధవరం వెళ్లే రహదారిలో శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వెనుక నూతనంగా ఇంటిని నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. దసరా సెలవులు రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి నరసింహ స్వామి దర్శనార్థం సోమవారం అహోబిలం వెళ్లారు. నిర్మానుష ప్రదేశం కావడంతో దొంగతనం చేయాలని భావించి దొంగలు ఇంటి తలుపులకు నిప్పు పెట్టారు. అదే సమయానికి జనార్ధన్ రావు ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులకు మంటలు చెలరేగుతున్నాయని నీటితో మంటలను ఆర్పేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి కాలిన తలుపుల ఫొటోలు తీసుకెళ్లారు. గురువారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు జనార్ధన్‌రావు తెలిపారు. గ్రామానికి చివరి ప్రాంతంలో ఇల్లు ఉండడంతో చోరీకి ప్రయత్నించారని, సరైన సమయంలో రావడం వల్ల ఎలాంటి నష్టమూ జరగలేదని తెలిపారు. ఆలస్యంగా వచ్చి ఉంటే కచ్చితంగా ఇంట్లో దొంగతనం జరిగేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు నిఘా పెట్టి పరిసర ప్రాంతాల్లో కూడా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు.

## అన్యాక్రాంతమైన భూములను అప్పగించండి

**- తహశీల్దార్‌కు శ్రీమఠం ఫిర్యాదు**

**ప్రజాశక్తి - మంత్రాలయం**



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠానికి చెందిన అన్యాక్రాంతమైన భూములను తిరిగి అప్పగించాలని శ్రీరాఘవేంద్రస్వామి మఠం నుంచి ఫిర్యాదు వచ్చినట్లు తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. శ్రీమఠం ఆధీనంలో ఉన్న భూములను గతంలో సేవలు అందించిన వారికి సర్వీస్ ఇనామ్ కింద ఇచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయని తెలిపారు. అర్చకులు, పురాణికులు, మంగలి, చాకలి తదితరులకు సర్వీస్ ఇనామ్ కింద భూములను ఇచ్చినట్లు చెప్పారు. కాల క్రమేణా అనుభవ దారులు భూమి పన్నులు కట్టి తమ పేర్లతో పట్టాదారు పాసుపుస్తకాలు పొందారని అన్నారు. కొందరు రిజిస్ట్రేషన్‌లు కూడా చేయించుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ప్రస్తుత పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు అన్యాక్రాంతమైన భూములపై దృష్టి సారించినట్లు చెప్పారు. సుమారు 79 సర్వే నెంబర్లలో గల భూములను అన్యాక్రాంతం నుంచి విడిపించి పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేసి విస్తీర్ణంతో కలిపి తమ మఠానికి అప్పగించాలని కోరారని తెలిపారు. సర్వే నెంబర్లను విచారణ కోసం విఆర్ఒ భీమనగౌడుకు అప్పగించామన్నారు. గతంలో ఉన్న తహశీల్దార్ ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేసే అధికారం తనకు లేదని తెలిపారు. డిప్యూటీ కలెక్టర్‌కు నివేదిక ద్వారా తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# సాగునీరందే వరకు పోరాటం

**- రైతు సమస్యలు పట్టని మంత్రులు, ఎమ్మెల్యేలు**
**- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి**

**ప్రజాశక్తి - కౌతాళం**

రైతులకు సాగునీరు సక్రమంగా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులకు సాగునీరందే వరకు తమ పోరాటం ఆగదని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి హెచ్చరించారు. గురువారం కౌతాళం మండలం కామవరం గ్రామం వద్ద ఉన్న ఎల్ఎల్‌సి హెడ్ రెగ్యులేటర్ దగ్గర మండల నాయకులు, రైతుల ఆధ్వర్యంలో వంటావార్పు చేసి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లిందని తెలిపారు. కనీసం తుంగభద్ర దిగువ కాలువ కింద సాగైన పంటలకు నీరందకపోవడంతో ఆ పంటలు కూడా ఎండుముఖం పట్టాయన్నారు. చేతికొచ్చిన పంటలు పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సాగునీటి సమస్యపై జిల్లా మంత్రులు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఇంటికి పరిమితమై రైతు సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా వలస వెళ్లే నియోజకవర్గ మంత్రాలయమని తెలిపారు. నియోజకవర్గంలో సాగునీరందించి పంటలు కాపాడితే కొంతవరకైనా వలసలను నివారించవచ్చని చెప్పారు. రైతులకు న్యాయం చేయాలని అధికారులతో పంట పొలాలను పరిశీలించి, ఎల్ఎల్‌సి అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. తుంగభద్ర దిగువ కాలువలో పుష్కలంగా నీరున్నా రైతులకు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. అధికారులు రైతులకు సాగునీరందించి పంటలను కాపాడాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, టిడిపి నాయకులు కోట్రేష్ గౌడ్, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు సాయిబాబా, టిప్పు సుల్తాన్, కోసిగి మండల కన్వీనర్ జ్ఞానేష్, జనసేన మండల అధ్యక్షులు రామాంజనేయులు, కాశీ విశ్వనాథ్, వెంకటరెడ్డి, రమేష్ గౌడ్, రాజాబాబు, ఉమేష్ గౌడ్, రంగస్వామి, నబిసాబ్, చిన్నభూంపల్లి నరసింహులు పాల్గొన్నారు.



వంటావార్పులో పాల్గొన్న తిక్కారెడ్డి, నాయకులు

## విఆర్ఒ అదృశ్యం - కేసు నమోదు

**ప్రజాశక్తి-ఆలూరు**

మండలంలోని హులేబీడు గ్రామంలో విధులు నిర్వహిస్తున్న విఆర్ఓఒ ఎ.లక్ష్మి నారాయణ రెడ్డి అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు... ఈనెల 9న విధుల్లో భాగంగా ఇంటి నుంచి వెళ్లిన ఎ.లక్ష్మి నారాయణ రెడ్డి రాత్రి అయినా ఇంటికి రాలేదు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిసిన విఆర్ఒ ఎ.లక్ష్మి నారాయణ రెడ్డి, ఎల్లార్తి రోడ్, ఎల్ఐసి కార్యాలయం వెనుకాల, ఆలూరు. ఇతర వివరాలకు సిఐ నెంబరు 9121101157, ఎస్ఐ నెంబరు 9121101158, విఆర్ఒ కుమారుడు తరుణ్ కుమార్ నెంబరు 8374774008కు సంప్రదించాలని కోరారు.

## కరువు, విద్యుత్‌పై నేడు రోడ్డు దిగ్బంధనం

**- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు**

**ప్రజాశక్తి - దేవనకొండ**

జిల్లాలో తీవ్ర కరువు నెలకొన్న నేపథ్యంలో జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని, ఉపాధి పనులు కల్పించాలని శుక్రవారం రోడ్డు దిగ్బంధనం చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. గురువారం వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి మాట్లాడారు. దేవనకొండ టర్నింగ్‌లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు రోడ్డు దిబ్బంధనం చేపడుతున్నట్లు తెలిపారు. కరువు సమస్యపై పాలకులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర వర్షాభావ పరిస్థితులతో, సాగునీటి సదుపాయాలు లేక పంటలు దెబ్బతిని నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి ఎకరాకు రూ.40 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు నేపథ్యంలో 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలని కోరారు. నేడు జరగబోయే రోడ్డు దిగ్బంధన కార్యక్రమాన్ని మండల రైతులు జయప్రదం చేయాలని కోరారు.

# తాగునీటి సమస్య రానివ్వం...

**- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి**
**- ఎస్ఎస్ ట్యాంకు బండ్ పనుల పరిశీలన**

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వబోమని, అధికారులతో కలిసి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. పట్టణానికి తాగునీరందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకు వద్ద జరుగుతున్న ఇసుక బండ్ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్యాంకు బండ్ కుంగిపోవడంతో నీరు నిలువ చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా సుమారు రూ.కోటితో ఇసుక బండ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇంకా ఎక్కువ మంది కూలీలను నియమించి త్వరగా పనులను పూర్తి చేసి ట్యాంకులో నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ట్యాంకును మరింత పరిశిష్టంగా నిర్మించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. వేసవి నాటికి అన్ని పనులూ పూర్తి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం అమృత్ పథకం కింద పనులు చేసేందుకు రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర దిగువ కాలువ నుంచి రెండు మోటార్లతో ఎస్ఎస్ ట్యాంకులో తాగునీటి నిల్వ చేస్తున్నామని వివరించారు. అధికారులు మరింత కష్టపడి పనిచేసి తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు రాజశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం

**ప్రజాశక్తి - ఆస్పరి**

బన్నీ ఉత్సవాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజినేయులు, కెవి.నారాయణ డిమాండ్ చేశారు. బన్నీ ఉత్సవాల్లో మృతి చెందిన గణేష్ మృతదేహానికి గురువారం పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మాల మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవంలో కర్రల సమరంతో బన్నీ ఆడుతుండగా చెట్టు విరిగి అక్కడున్న మాల గణేష్‌తో పాటు మరో ఇద్దరిపై పడిందని తెలిపారు. గణేష్ అక్కడిక్కడే మృతి చెందారన్నారు. బన్నీ ఉత్సవాల్లో ప్రాణాలు కోల్పోవడానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. దేవరగట్టులో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు ఎండోమెంట్ శాఖ నుంచి ప్రతి కుటుంబానికీ రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, మాణిక్యప్ప, రంగప్ప, మధు రెడ్డి పాల్గొన్నారు.

## 'భాష్యం'పై చర్యలు తీసుకోవాలి

**- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భాష్యం స్కూల్‌లో అడ్మిషన్ లేకపోయినా తరగతులు బోధిస్తూ రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న భాష్యం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, పట్టణ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఇఒ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మిగనూరులోని భాష్యం స్కూల్‌లో అడ్మిషన్ లేకపోయినా అక్రమంగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకుంటున్నారని తెలిపారు. మెరుగైన విద్యను బోధిస్తున్నామని తల్లిదండ్రుల దగ్గర ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. పట్టణ నాయకులు నితీష్, ఆనంద్, ప్రమోద్, మోహన్, బన్నీ పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

**- తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి**

**ప్రజాశక్తి -పెద్దకడబూరు**

ప్రతి కార్యకర్త కుటుంబానికీ అండగా ఉంటామని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మురువణి గ్రామంలో బోయ చంటి సోదరుడు టిడిపి కార్యకర్త ఎర్రన్న గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి గ్రామానికి చేరుకున్నారు. ఎర్రన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. టిడిపి నాయకులు పాలకుర్తి తిక్కారెడ్డి ఎల్లవేళలా అండగా ఉంటారని తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

## 29లోపు ఈ-క్రాప్ చేయించుకోవాలి : ఎడిఎ

**ఆలూరు :** రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ చేయని వారు ఈనెల 29లోపు చేయించుకోవాలని ఎడిఎ సునీత తెలిపారు. గురువారం ఆలూరు ఆర్‌బికె-1లో గ్రామసభ, పంట నమోదు జాబితా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణ, గ్రామ ఆర్‌బికెలలో ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వారి వివరాలను నోటీసు బోర్డులో పొందు పరచాలని ఆర్‌బికె సిబ్బందికి సూచించారు. ఇంకా నమోదు చేయని రైతులు ఈనెల 29లోపు రాతపూర్వకంగా స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఇవ్వాలని తెలిపారు. ఎఒ వెంకటేష్ గౌడ్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీమఠంలో సీతారామిరెడ్డి పూజలు

**మంత్రాలయం :** ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి గురువారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. ఆయనకు ఎస్ఐ వేణుగోపాల్ రాజు భద్రత కల్పించారు. వైసిపి నాయకులు శివకుమార్, వడ్డే చిన్న ఈరన్న, ప్రాణేష్, సున్నం రామయ్య ఉన్నారు.

## పౌర సరఫరాల గోడౌన్ తనిఖీ

**ఎమ్మిగనూరు :** ఎమ్మిగనూరు పౌర సరఫరాల గోడౌన్‌ను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వ రికార్డ్స్, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడారు. బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. తహశీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్ గురు రాజారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేషనల్ ఫుట్ బాల్‌కు 'దీక్ష' విద్యార్థి

**ఎమ్మిగనూరు :** అండర్-19 నేషనల్ ఫుట్ బాల్ టోర్నీకి ఆంధ్ర జట్టు తరపున పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఎస్‌బి.అభిని గురువారం కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మండలానికే గర్వకారణమని తెలిపారు. జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లో ఈ నెల 31 నుంచి నవంబర్ 4 వరకు 67వ నేషనల్ ఫుట్ బాల్ టోర్నీ జరగనుందని చెప్పారు. ఈ పోటీలకు ఎంపికైన అభికి కళాశాల యాజమాన్యం, సిఇఒ తిరుమలరెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. కొత్త బూట్లు, జెర్సీ అందజేశారు.

## సాగునీటిపై ప్రచారాలు మానుకోవాలి : వైసిపి

**ప్రజాశక్తి - కౌతాళం**



కౌతాళంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

తుంగభద్ర దిగువ కాలువ సాగునీటిపై టిడిపి నాయకులు తిక్కారెడ్డి అసత్య ప్రచారాలు మానుకోవాలని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, మండల నాయకులు ఏకం రెడ్డి తెలిపారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల వల్ల కొంతవరకు నీటి సమస్యలున్నా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో రైతుకు సాగునీరు అందుతోందని తెలిపారు. దిగువ కాలువ పరిధిలోని ఆయా డిస్ట్రిబ్యూటర్ల ఆయకట్టు రైతులకు వంతుల వారీగా సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. ఎక్కడో బండపై ఎండిపోయిన పంటను చూపించి అసత్య ప్రచారం చేయడం తిక్కారెడ్డికే చెల్లిందన్నారు. కేవలం కొంతమంది రైతులతో నిరసన చేసి రైతుల కోసమని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పిలుపునిస్తే ఎంతమంది రైతులు వస్తారో ప్రజలకు బాగా తెలుసన్నారు. పార్టీలకతీతంగా రైతులకు సాగునీరందించే ఘనత ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి చెందుతుందని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వందలాది రైతుల ఆధ్వర్యంలో తుంగభద్ర కాలువపై పర్యటించి బళ్లారిలోని బోర్డు కార్యాలయంలో అధికారులతో చర్చించి సాగునీరు తీసుకొచ్చారని చెప్పారు. కాలువపై కూర్చొని భోజనాలు చేస్తే రైతులకు సాగునీరు రావని, సంబంధిత అధికారులతో పోరాడితే వస్తాయని తెలిపారు. రైతుల కోసం 24 గంటలు పని చేసే బాలనాగిరెడ్డిపై విమర్శలు ఆపి ప్రజలకు ఎలా దగ్గర కావాలో ఆలోచించుకోవాలని సూచించారు. వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, సర్పంచి పాల్ దినకరన్, బంటకుంట సర్పంచి గోపాల్ రెడ్డి, వైసిపి నాయకులు హాల్వి చెన్నప్ప, అబ్దుల్ సమద్, హుసేని, శివరాం, మల్లయ్య, వెంకన్న, సిద్ధ రామ పాల్గొన్నారు.

## కాజీపురం జలాశయానికి నీరు నింపండి

**- సర్పంచి గోవిందరాజులు**

**ప్రజాశక్తి - చిప్పగిరి**



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి

వచ్చే వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే తక్షణమే కాజీపురం జలాశయానికి తాగునీటిని నింపాలని చిప్పగిరి సర్పంచి గోవిందరాజులు ఆధ్వర్యంలో సర్పంచులు అధికారులను కోరారు. గురువారం కాజీపురం రిజర్వాయర్ దగ్గర ఎంపిడిఒ సి.వి.కొండయ్యకు సర్పంచి గోవిందరాజులు, ఇతర గ్రామాల సర్పంచులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడారు. కాజీపురం జలాశయంలో రోజురోజుకూ తాగునీరు తగ్గడంతో చిప్పగిరిలో పది రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారని చెప్పారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే వేసవిలో తాగునీటి సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా జలాశయానికి తాగునీరు నింపాలని కోరారు. కాజీపురం సర్పంచి రమాదేవి భర్త రమేష్, హేమాంజనేయులు, గుమ్మనూరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





ఎగ్జామ్ ప్రిపరేషన్ శిక్షణను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

# మోడీని గద్దె దింపుదాం

- ప్రజారక్షణ భేరి బస్సు జాతాను జయప్రదం చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఏసురత్నం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.యేసు రత్నం

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

కేంద్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని గద్దె దింపాలని, ప్రత్యామ్నాయ ఇండియా కూటమిని గెలిపిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఏసురత్నం పేర్కొన్నారు. ఈ నెల 31న జరిగే ప్రజా రక్షణ భేరి బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరారు. గురువారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశం పట్టణ కమిటీ సభ్యులు ఏ.సురేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజలపై విచ్చలవిడిగా భారాలు మోపి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. 2014లో బిజెపి అధికారంలోకి రాకముందు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి తొమ్మిది సంవత్సరాలు అవుతున్నా ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేసి ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని అన్నారు. వంద రోజుల్లో ధరలు అరికడతామని చెప్పి నేడు పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్తు నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా నియంత్రించడం లేదన్నారు. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ నేడు అప్పులను, ఆత్మహత్యలను రెట్టింపు చేశారని విమర్శించారు. జిఎస్‌టి పేరుతో సామాన్య ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతూ రాష్ట్రాలకు రావాల్సిన జిఎస్టి నిధులపైనా కేంద్రం పెత్తనం చేస్తుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకపోగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసం చేసిన మోడీకి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు గులాంగిరి చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ప్రత్యామ్నాయ రాజకీయ విధానం కోసం రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతాలు జరుగుతున్నాయని, అందులో ఒకటి ఆదోని నుండి ప్రారంభమయ్యే జాతా ఈ నెల 31వ తేదీ ఆత్మకూరుకు చేరుకుంటుందని, పాతబస్టాండ్‌లో జరుగు బస్సు జాతాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, సీనియర్ నాయకులు ఎం.రజాక్, నాయకులు ఎస్. స్వాములు, దినేష్, నాయకులు వీరన్న, పాల శివుడు, ఏ. కిరణ్, గణపతి, అంబయ్య, శ్రీధర్, సతీష్, నబి, మోహన్, రాజు, ప్రేమ్, కలిముల్లా, చాంద్, జబిల్లా, రమణ తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజారక్షణభేరి జాతాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు కోరారు. మిడుతూరు లోని సిపిఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నాయకులు పి లింగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలందరూ ఐక్యంగా పోరాడితే ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కును కాపాడు కోగలమన్నారు. నాయకులు పకీర్ సాహెబ్, ఓబులేసు, దానమయ్య, ఏసన్న, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. **డోన్:** ఈనెల 31న నంద్యాల పట్టణంలో పెద్ద ఎత్తున జరుగు ప్రజా రక్షణ భేరీ బహిరంగ సభలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సిఐటియు మండల అధ్యక్షులు రామాంజ నేయులు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షమీం బేగంలు కోరారు. ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు కొండయ్య జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కీ హరి, రామలింగం, రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇర్ఫానా బేగం, మండల అధ్యక్ష కార్యదర్శులు జె.అశోక్, మహబూబ్ బాషా, మహేంద్ర, సురేష్, సుధాకర్, భాస్కర్, రాజేంద్ర, మహేష్, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూర్ టౌన్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజారక్షణ భేరి బస్సు జాతా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.భాస్కర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక భరత్ కాంప్లెక్స్‌లో సిఐటియు రూరల్ కార్యదర్శి సి.నాగన్న అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 28, 29 తేదీలలో చేపట్టిన బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆంజనేయులు, హుస్సేన్, కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డోన్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

# ఎస్ఇఎఎస్ పరీక్షలకు సన్నద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

అన్ని యాజమాన్య పాఠశాలల్లో 3, 6, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు (స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షలపై తగు రీతిలో అవగాహన కల్పించి సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఎస్‌పిజి, సెయింట్ జోసెఫ్ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థుల ఎస్ఇఎఎస్ పరీక్షల ప్రిపరేషన్‌పై కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఇఎఎస్ సర్వే కింద ఎంపికైన పాఠశాలలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పిల్లలను తగు రీతిలో సన్నద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ప్రాక్టీస్ పేపర్స్‌ను ఈ వారం రోజులు విద్యార్థులతో తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ఎస్ఇఎఎస్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సర్వేలో ఎంపికైన ప్రతి పాఠశాల ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పిల్లలను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. మండలాల్లో ఎమ్మార్వో, ఎంపీడీవోలు, నియోజకవర్గస్థాయిలో స్పెషల్ ఆఫీసర్లు కూడా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ప్రాక్టీస్‌పై పరిశీలిస్తారని తెలిపారు. మండల విద్యాధికారులు మండలంలోని ప్రతి పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ప్రాక్టీస్‌పై జిల్లా విద్యాశాఖాధికారికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రధానో పాధ్యాయులు విద్యార్థులను ప్రతిరోజు ఎగ్జామినేషన్ మోడ్‌లో కూర్చోబెట్టి పిల్లలకు ప్రాక్టీస్ పేపర్ ఇచ్చి, టీచర్ గైడ్‌గా ఉంటూ, వారితో స్వయంగా ప్రాక్టీస్ చేయించాలన్నారు. ప్రతి రోజూ ప్రాక్టీస్ ఫొటోస్ అధికారిక వాట్సప్ గ్రూప్‌లో షేర్ చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా, అలసత్వం వహించినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# పంట నమోదు వివరాలు సరిచూసుకోండి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్-2023 పంట వివరాలను సోషియల్ ఆడిట్ కోసం ప్రదర్శించారని, రైతులు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు అన్నారు. గురువారం మండలంలోని పేరాయిపల్లె, జి.జంబులదిన్నె గ్రామాలలో జొన్న, మినుము పంటలను ఆయన పరిశీలించారు. పంటల స్థితిగతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంట నమోదు పూర్తి అయిందని, రైతుల జాబితా ఈ నెల 26 నుంచి 29 వరకు ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ప్రతి రైతు చూసుకొని పేరు, విస్తీర్ణం, పంట, నీటి వసతి ఇతర ఏమైన పొరపాట్లు ఉంటే గ్రీవెన్స్ రూపంలో అర్జీ అందజేసి రైతు భరోసా సిబ్బందికి తెలియజేసి సరిచేసుకోవాలని తెలిపారు. అన్ని గ్రామాలలో సోషల్ ఆడిట్ జరిపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నంద్యాల ఎడిఎ చెన్నయ్య, ఎఒ కిషోర్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి హుస్సేన్ బాషా, విఎఎలు షాహిన్, హరినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు. **రుద్రవరం :** ప్రతి రైతు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, అప్పుడే వ్యవసాయ శాఖ తరపున అందించే సంక్షేమ పథకాలకు అర్హులవుతారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు తెలిపారు. గురువారం మండలంలోని కోటకొండ, ఎల్లావత్తుల, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, రుద్రవరం రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్-2023 సంవత్సరం సంబంధించి ఈ క్రాప్ సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించిన ముసాయిదా జాబితాను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి, ఎడి చెన్నయ్య, టెక్నికల్ ఏఓ నాగేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ, విస్తరణ అధికారి రాజు, కార్యదర్శులు షాహినూర్, పాములేటి, కళావతి, గ్రామ సర్పంచులు డేగాని వెంకటేష్, చెన్నప్ప, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు



# ఎసిబి వలలో జూనియర్ అసిస్టెంట్

- లంచం తీసుకుని పట్టుబడిన వైనం
- జూనియర్ అసిస్టెంట్, డ్రైవర్‌పై కేసు నమోదు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల జిల్లా రిజిస్టార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆయన డ్రైవర్ ప్రకాష్ రెడ్డిలు ఎసిబి వలలో చిక్కారు. గురువారం నంద్యాల జిల్లా రిజిస్టార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. రైతు నుండి రూ.5 వేలు లంచం తీసుకున్న డ్రైవర్‌ను, జూనియర్ అసిస్టెంట్‌లను పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన రైతు చిన్నప్ప తన 3.20 ఎకరాల భూమిని చుక్కల భూమి జాబితా నుండి తొలగించాలని ఈ ఏడాది జూలై 12న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామున్‌ను కలిసి అభ్యర్థించాడు. స్పందించిన జిల్లా కలెక్టర్ చిన్నప్ప పొలాన్ని చుక్కల భూమి జాబితా నుండి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో రైతు చిన్నప్ప జిల్లా రిజిస్టార్ ఆఫీసు జిల్లా రిజిస్టార్‌ను కలిసేందుకు వెళ్లాడు. అక్కడ జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ రెడ్డి రైతును పిలిచి విషయం అడిగారు. ఈ పని పూర్తి చేయాలంటే రూ.30 వేలు లంచం ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ డిమాండ్ చేశారు. లంచం ఇవ్వలేనని, పొలాన్ని నమ్ముకుని కష్టపడే వాడినని చిన్నప్ప ప్రాధేయపడ్డాడు. జూనియర్ అసిస్టెంట్ ఒప్పుకోలేదు. రైతు చిన్నప్ప ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం 20 వేల రూపాయల లంచం మాత్రమే ఇవ్వగలనని రైతు చిన్నప్ప చెప్పగా జూనియర్ అసిస్టెంట్ అంగీకరించారు. కిరణ్ కుమార్ రెడ్డికి ఫోన్ చేయగా ఆఫీసు ఎదుట ఉన్న కూల్ డ్రింక్స్ షాపు వద్దకు డ్రైవర్ ప్రకాష్ రెడ్డి వస్తాడని, అడ్వాన్స్‌గా రూ.5 వేలు ఇవ్వాలని చెప్పాడు. ఈ మేరకు డబ్బు తీసుకొని ఆఫీసులోకి వెళ్లిన ప్రకాష్ రెడ్డిని ఎసిబి డిఎస్‌పి. సప్తగిరి, సిబ్బంది రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ రెడ్డి గతంలో అవుకులో కూడా లంచం తీసుకుంటూ దొరికాడని చెప్పారు. జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ రెడ్డి పై, డ్రైవర్ ప్రకాష్ రెడ్డిలపై కేసు నమోదు చేశామని, వీరిద్దరిని రేపు ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని పేర్కొన్నారు.



ఎసిబి అధికారులకు పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్, డ్రైవర్



మాట్లాడుతున్న రీజనల్ డిప్యూటీ డైరెక్టర్

## ఆదాయం పెంచుకోవాలి

- మార్కెట్ యార్డ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

మార్కెట్ యార్డు ఆదాయాన్ని పెంచుకోవాలని మార్కెట్ యార్డ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ రెవిన్యూ పెంచాలని, రికార్డులను ప్రాపర్‌గా మెయింటైన్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ గోదాములను ప్రైవేటు వారికి బాడుగకు ఇచ్చి ఆదాయం పెంచుకోవాలని అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డ్‌ను బాగా అభివృద్ధి చేస్తున్నారని కార్యదర్శి నారాయణ స్వామిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కార్యదర్శి నారాయణస్వామి, సూపర్వైజర్ సురేష్ పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - అవుకు**

అవుకు మండలంలోని గుండ్ల సింగవరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రంగనాయకుల స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని బనగానపల్లి శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఆలయ నిర్మాణ పనులను ఎమ్మెలే గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో రూ.1 కోటి 58 లక్షలతో రంగనాయకుల స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అన్ని హంగులతో ఆలయం నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్ చుట్టూ షాపులను తొలగించాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - పాణ్యం**

పాణ్యం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల చుట్టూ ఉన్న షాపులను వెంటనే తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బత్తిన ప్రతాప్, వనం వెంకటాద్రి డిమాండ్ చేశారు. షాప్‌లను తొలగించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్కూలుకు దాదాపుగా 50 సంవత్సరాల నుండి చుట్టూ కాంపౌండ్ వాల్ లేదని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాలలో ఎవరు పడితే వాళ్ళు రావడం, రాత్రి సమయాలలో అసాంఘిక కార్యక్రమాలు అక్కడే జరుగుతున్నాయని అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా ఏ ఒక్కరూ స్పందించడం లేదన్నారు. చుట్టూ కాంపౌండ్ వాల్ లేనందువలన స్కూల్ ఆవరణం చుట్టూ షాపులు కేటాయించుకొని విద్యార్థులకు భద్రత లేకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎంఇఒ, ఎంపిడిఒ, ఎంఆర్ఒ, ఎమ్మెల్యేకు తెలియచేసి షాప్‌లన్నీ తీసివేయిస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకుడు రాజు, రవి, శ్రావణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు, విద్యార్థినులు

## జిపిఎస్‌ను రద్దు చేయాలి : ఎపిటిఎఫ్

**ప్రజాశక్తి - బనగానపల్లె**

ప్రభుత్వ, ఉద్యోగ ఉపాధ్యాయులుగా 30 నుండి 40 సంవత్సరాల సేవ చేసి విశ్రాంత సమయంలో ఎటువంటి సామాజిక భద్రత లేని జిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మాధవస్వామి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఈ నెల 29న విజయవాడలో తలపెట్టిన ధర్నా పోస్టర్లను ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ సాధన కోసం ఈ నెల 29వ తేదీ ఏపీటీఎఫ్ ధర్నాకు రాష్ట్రం నలుమూల నుండి ఉద్యోగ ఉపాధ్యాయులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం. మధుసూదన్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ పి.సుబ్బరాయుడు, మండల అధ్యక్షులు జె. వెంకటకృష్ణుడు, అవుకు మండల ప్రధాన కార్యదర్శి ఎస్. ఓబులేసు, బేతంచెర్ల మండల అధ్యక్షులు ఎస్.మహబూబ్ బాషా, శేఖర్, రఫీ, మహమ్మద్ రఫీ, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం

- ఐఎంఎ మహిళా విభాగం

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

వైద్య సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఐఎంఎ మహిళా విభాగం నూతన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కల్పన, డాక్టర్ సరిత తెలిపారు. గురువారం నంద్యాలలో జరిగిన ఐఎంఎ మహిళా విభాగం సర్వసభ్య సమావేశంలో రానున్న రెండు సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్ కల్పన, గౌరవాధ్యక్షురాలుగా డాక్టర్ నర్మదా, కార్యదర్శిగా డాక్టర్ సరిత, కోశాధికారిగా డాక్టర్ లలిత, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ శశికిరణ్ సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ నేట్ల శిల్పా, డాక్టర్ ప్రియదర్శిని, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నంద్యాల మహిళా వైద్య విభాగం ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు, వైద్య ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. నూతన కార్యవర్గాన్ని ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అభినందించి మాట్లాడారు. ఐఎంఎ మహిళా విభాగం సేవల ద్వారా రాష్ట్రంలో మంచి గుర్తింపు పొందారని, అదే మార్గంలో సేవా కార్యక్రమాల ద్వారా వైద్యులు ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.



# రైతు సంక్షేమాన్ని పట్టించుకోని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

- ఐదు రోజుల్లోగా కెసి కెనాల్‌కు నీరు తెప్పించాలి
- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

రైతన్నల సంక్షేమాన్ని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ విస్మరించారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. గురువారం ఆళ్లగడ్డలోని స్థానిక కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి చూస్తుంటే చాలా బాధాకరంగా ఉందన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే తెలంగాణకు మేలు చేసే విధంగా ప్రవర్తిస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. ఎపి రావాల్సిన ఆస్తులు, నీళ్ల పక్క రాష్ట్రం వాళ్లు తీసుకుంటున్నా వైసిపి ప్రభుత్వం చోద్యం చూస్తుందే తప్ప ఒక్క మాట కూడా మాట్లాడడం లేదన్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం తెలంగాణ ప్రభుత్వం రిజర్వాయర్‌లో ఉన్న నీళ్లను ఖాళీ చేసినా నోరు కూడా మెదపకపోవడం బాధాకరమన్నారు. ఐఎబి సమావేశంలో ఆరుతడి పంటలు వేసుకోవాలని చెప్పిన అధికారులు ఆ పంటలకూ సాగునీరు ఇవ్వలేకపోతున్నారని అన్నారు. కెసి కెనాల్, తెలుగు గంగ కింద సాగునీరు రాక రైతులు ఆందోళన చెందుతుంటే స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సాగునీటి సలహాదారులు ఏమి చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. రైతు సమస్యలపై ఇంత వరకు ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు కలెక్టర్‌తో మాట్లాడి ఐదు రోజుల్లోగా కెసి కెనాల్‌కు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తుంగభద్రలో ఉన్న నీటిని విడుదల చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజలకు పథకాలు ఇస్తే చాలా..? అభివృద్ధి వద్దా అని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పట్టణంలో టిడ్కో గృహాలను ప్రారంభించారని, కేవలం కొంతమందికి పంపిణీ చేసి బిల్డప్ హంగామా చేశారని విమర్శించారు. సమావేశంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు సిద్ధంరెడ్డి జాఫర్ రెడ్డి, కుందూరు రామిరెడ్డి, ఇంజేడు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



దస్తగిరి స్వామి జాతరలో పాల్గొన్న టిడిపి యువ నాయకులు

## దస్తగిరి స్వామిని దర్శించుకున్న టిడిపి యువ నాయకులు

**ప్రజాశక్తి - రుద్రవరం**

మండలంలోని చిత్రేనిపల్లె గ్రామంలో గురువారం జరిగిన దస్తగిరి స్వామి జాతరకు టిడిపి యువ నాయకులు భూమా విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చిత్రేనిపల్లె గ్రామంలోని జనసేన, టిడిపి నాయకుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిశారు. కార్యక్రమంలో నాయకులు కోరే సంజీవరాయుడు, మైలేరి మల్లయ్య, ముద్దం ప్రసాద్, పగడాల సుబ్బారావు, నగిరి బాల నరసింహ, దూదేకుల ఇమాములు, దూదేకుల పీరయ్య, దొడ్డి నరసయ్య, గోపు సంజీవ రాయుడు, రామలింగం, గోపు సుబ్బారావు, మైలేరి గుర్రప్ప, మైలేరి కష్ణ, జాండ్లవరం నాగార్జున, గువ్వల వెంకట నరసయ్య, పోలా గురుమూర్తి, ముత్తలూరు రామసుబ్బారెడ్డి, రాచంశెట్టి వెంకటసుబ్బయ్య, చక్కెర రామస్వామి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి 'గడప గడప' : ఎంపిడి

**ప్రజాశక్తి - సంజామల**

మండలంలోని కానాల, కమలపురి, ఓత్రమాధిని, వసంతాపురం గ్రామాలలో ఈ నెల 28వ తేదీ నుంచి 31 వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, వాలంటరీలు పాల్గొనాలని పేర్కొన్నారు.

## 27న దొర్నిపాడులో స్పందన

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ఈ నెల 27వ తేదీ దొర్నిపాడు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద మండల స్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తామని, ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పేదలందరికీ వైద్యమందించడమే లక్ష్యం

**- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి**

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

పేదలందరికీ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. గురువారం కొలిమి గుండ్ల మండలంలోని పెట్టికోట గ్రామ సచివాల యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, ఎంపిడిఒ జివి ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కంటి సమస్య ఉన్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేరం సత్యనారాయణ రెడ్డి, నందిపాడు సర్పంచ్ ఆర్.గురివిరెడ్డి, వైసిపి మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పుల్లన్న, సుబ్బారెడ్డి, వైద్యులు, ఆశావర్కర్స్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. **బనగానపల్లె :** జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరంలాంటివని ఎంపీడీవో శివరామయ్య పేర్కొన్నారు. మండలంలోని మీరాపురం గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఎంపీడీవో శివరామయ్యలు ప్రారంభించారు. టంగుటూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో 1124 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సోయల్, ఎంపీహెచ్ఈఓ నల్లగట్ల వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు మనోహర్ రెడ్డి, బత్తుల రామ్మోహన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **పగిడ్యాల :** జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి, జడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డిలు అన్నారు. పగిడ్యాల సచివాలయం-2 పరిధిలో పాలమర్రి ఎంపీపీ పాఠశాలలో వైద్య శిబిరాన్ని నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, ఏపీ ఓ మద్దిలేటి, విశాఖ అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటరీలు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** మండలంలోని కరివేన గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు సురేష్, ఎంపీడీవో మోహన్ కుమార్, డాక్టర్ పవన్. డాక్టర్ గోపాల్, టిబి యూనిట్ ఆఫీసర్ పెద్ద మస్తానయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా వచ్చిందని సర్పంచ్లు శివమ్మ, యామ నరసమ్మ,ఎంపీటీసి నరసింహులు అన్నారు. మండలంలోని పెద్దబోధనం సచివాల యం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. పెద్దబోధనం, చిన్నబోధనం,తిప్పనపల్లె గ్రామ ప్రజలకు వైద్యురాలు పరీక్షలు నిర్వహించి మందులను అందజేసారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్ దౌలా, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ,సిహెచ్ఓ రమణమ్మ,హెల్త్ఎడ్యుకేటర్ వెంకటమ్మ,సూపర్వైజర్లు రామలింగారెడ్డి, సీతారాముడు, పంచాయతి కార్యదర్శి సబియా తదితరులు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్


పగిడ్యాల : ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

## శ్రీశైలంలో ప్రముఖులు

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలక్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. పశ్చిమ బెంగాల్ మేదినపుర్ ఎంపి దిలీప్ గోస్, పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఐఎఎస్ రాహుల్ బండారి, రాఖీ గుప్తా బండారి ఐఎఎస్, వాసవి త్యాగి ఐఎఫ్ఎస్, భానుమతి ఐఎఫ్ఎస్ తదితరులు దర్శనార్థమై ఆలయ రాజగోపాల్ వద్దకు చేరుకోగా ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి మోహన్ అర్చకులు వేదపండితులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.


స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న మేదినపుర్ ఎంపి

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన కట్టుబడి లక్ష్మీదేవికి వైద్య ఖర్చుల కోసం భర్త కట్టుబడి బాబుకు ఎమ్మెల్యే ఆర్థర్ సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఆర్థిక సహాయం నిమిత్తం వచ్చిన రూ. 65 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే తన కార్యాలయం నందు లబ్ధిదారుని భర్త కట్టుబడి బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా కట్టుబడి బాబు మాట్లాడుతూ తాము వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని జీవనం సాగిస్తున్నామని తన భార్య గత 4, సంవత్సరాల నుండి మోకాళ్ల నొప్పులతో బాధపడుతుందని తన భార్యకు చికిత్స చేయించడానికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించిన శాసనసభ్యులు తొగరు ఆర్థర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ నగర్ గ్రామ వైసిపి నాయకులు శ్రీనాథ రెడ్డి, నంది కొట్కూరు మండల నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి, జిల్లా యస్.సి విభా గం అధ్యక్షులు సగినేల వెంకట రమణ, పాలమర్రి దామెరాకుల జీవన్ సుం దర్ రాజు, విశ్రాంత పోలీసు అధికారి పెరుమాళ్ళ జాన్, మారుతి నగర్ అయ్యన్న, మల్యాల శంకరయ్య, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

In The Court of the Family Court
Cum Vth Additional District Court
of Tirupati
F.C.O.P. 7/2021
Gandla Sireesha ...Petitioner
V/s
N.Siva Kumar ...Respondent
**Notice to Respondent**
N.Siva Kumar S/o N.Chinnavenkata Subbaiah, Residing at D.No.1-129, Venkata puram Village, Banaganapalli Mandalam, Kurnool District.
పై పిటీషన్‌లో పిటీషనర్ విడాకుల కొరకు రెస్పాండెంట్ పై కేసు వేసినది. కావున రెస్పాండెంట్ అయిన నీవు గానీ లేక నీ అడ్వకేటు ద్వారా కానీ ఆక్షేపనలు వున్నా తేది. 07.11.2023 పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥లకు హాజరై అభ్యంతరములు తెలుపుకోగలరు. లేనియెడల నీకు పరోక్షముగా కోర్టువారు తీర్పు ఇవ్వగలరు.
వాయిదా తేది 07.11.2023
**జి.శిరీష** పిటీషనర్

**MISSING PASSPORT**
షేక్ హుసేన్ (ఆధార్ నెం.664517392127) S/o. షేక్ ఖాదర్ వలి, గుంతపాలెం వీధి, చాగలమర్రి వారి X5805470 నెంబర్ గల Passport తేది 20-10-2023 న ఉదయం 10-00 గంటలకు జిరాక్స్ నిమిత్తం వచ్చునపుడు, Passport చాగలమర్రిలో పోయినది. దొరికిన వారు ఈ క్రింద అడ్రస్ ఇవ్వగలరు.
షేక్ హుసేన్ S/O షేక్ ఖాదర్ వలి
సెల్ : 8106397388, 8008849241

## పంట నమోదుపై అభ్యంతరాలు తెలపాలి : ఏడి


జాబితాను పరిశీలిస్తున్న ఏడి

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదుపై అభ్యంతరాలు ఉంటే రైతులు రాతపూర్వకంగా రైతు భరోసా కేంద్రం సిబ్బందికి తెలియజేయాలని ఆత్మకూరు ఏడి ఆంజనేయ తెలిపారు. గురువారం మండలంలోని నందికుంట గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి మహేష్ ఆధ్వర్యంలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను 100 శాతం ఈక్రాప్ నమోదు చేయడం జరిగిందని, పంటల నమోదు ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీల నిమిత్తం ఈనెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అలాగే గురువారం నుండి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల నందు ఈనెల 29వ తేదీ వరకు పంట నమోదుపై గ్రామ సభలు జరుగుతుందని రైతులందరూ సద్వినియోగపరుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు వి శివకృష్ణ నాయక్, ఎంపీఈవో ఉమామహేశ్వరి బాయి, గ్రామ రైతులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో ఈ - పంట నమోదు చేసిన రైతుల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి డి.విష్ణు వర్ధన్ రెడ్డి తెలిపారు. అభ్యంతరాలుంటే స్థానిక రైతు భరోసా కేంద్రం నందు అధికారులకు తెలిపాలని సూచించారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం రైతుల జాబితాను ప్రదర్శించడం జరిగిందని రైతులు తమ పేర్లను పంటలను చూసుకోవాలని ఎఒ స్వాతి తెలిపారు. ఆమె ఎర్రగుంట్ల ఆర్‌బికెను సందర్శించి పలు సూచనలు చేశారు. ఇంకా ఎవరైనా రైతు సోదరులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోకుండా ఉంటే చేసుకోవాలని సూచించారు. **నంద్యాల రూరల్ :** ఖరీఫ్‌కి సంబంధించి ఈ పంట నమోదులో రైతుల పంట వివరాలలో తప్పులుంటే సరిచేసుకోవాలని ఎఒ ప్రసాదరావు పేర్కొన్నారు. నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ఎఒ ఈ పంటలో నమోదు చేసిన రైతుల, పంటల వివరాలను గ్రామ సభ నిర్వహించి సామాజిక తనిఖీ నిమిత్తం ఆర్‌బికెలో అందుబాటులో వుంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మహారాజశ్రీ కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఇ.పి 22/2019 ఓ.ఎస్ 37/2017
టంగుటూరి సత్యనారాయణ. ...డి.హెచ్.ఆర్
వర్సెస్
కరువాడి మాధవరెడ్డి
...జె.డి.ఆర్
టు,
కరువాడి మాధవరెడ్డి తండ్రి నరసింహారెడ్డి
40 సం॥లు, హిందూ, వ్యాపారము,
ఇంటి నెం.8-12-49, విద్యానగర్ వీధి,
ఆళ్లగడ్డ గ్రామము, పోస్టు, కర్నూలు జిల్లా,
ప్రస్తుతం నంద్యాల జిల్లా.
ప్రతివాది/జె.డి.ఆర్‌కు యు/ ఆర్డర్ 21 రూల్ 34 నోటీసు
పై అమలు అర్జీలోని డి.హెచ్.ఆర్ ఇ.పి. షెడ్యూలు దాఖల భూమిని యు/ఆర్డర్21రూల్34 సి.పి.సి మేరకు రిజిష్టరు గావించి ఇవ్వవలసినదిగా కోర్టు వారిని అభ్యర్థించి యున్నాడు. సదరు నోటీసు మీకు స్వయంగా ముట్టనందువలన కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ప్రత్యామ్నాయముగా అనగా పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయమని ఆదేశించి ఉన్నారు. కావున మీరు పై కోర్టు వారి ఎదుట తేది 7/11/2023 ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ వకీల్ ద్వారా గాని హాజ రయి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
వాయిదా 7/11/2023
డి.మధుసూదన్ రెడ్డి,
డి.హెచ్.ఆర్ పరం అడ్వకేటు,
కోవెలకుంట్ల

## 28న సచివాలయ కన్వీనర్ల సమావేశం

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

రాష్ట్ర ప్రభుత్వం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో జెసియస్ కన్వీనర్ అబూబక్కర్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదిన జై కిసాన్ పార్కు నందు సచివాలయ కన్వీనర్‌ల సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మన్సూర్ పాల్గొననున్నారు.

## వెండి నాగ పడిగె వితరణ

**ప్రజాశక్తి - పాణ్యం**

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామి వారికి బనగానపల్లె పట్టణానికి చెందిన జెక్కు సుబ్రమణ్యం కుమారుడు అభిరామ్ 1 కేజీ 30 గ్రాముల వెండి నాగ పడిగెను గురువారం ఆలయ ఇఒ రామకష్ణకు అం దజేశారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బం ది సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి కరువు కనిపించడం లేదా? : టిడిపి

**ప్రజాశక్తి -ప్యాపిలి**

రాయలసీమలో కరువు కోరలు చాస్తూ ఉంటే రాష్ట్ర ప్రజలు వలస పోతుంటే ముఖ్యమంత్రికి కనిపించడం లేదా అని తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. గురువారం ఆయన ప్యాపిలిలో మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు పాదం బాగుండదని, వర్షాలు కురవవు అని వైసీపీ విష ప్రచారం చేశారని ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పాదం బాగుంటే ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస ఎందుకు వెళుతున్నారని, వర్షాలు ఎందుకు కురవడం లేదన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నారా భువనేశ్వరి చేపట్టిన యాత్రను విజయవంతం చేయాలన్నారు. జెమ్స్,నాగేంద్ర, కొంగనపల్లె మధు, ప్రిన్సిపాల్ మధు,మల్లికార్జున, అనుదీప్, శివ కిషోర్,బ్యాంకు శీను,పుల్లారెడ్డి, కదిరప్ప, మద్దిలేటి, బాల రంగన్న తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** తెలుగుదేశం పార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యం అని తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గం టిడిపి శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ గంగాదేవి అన్నారు. వెంగల్ రెడ్డి పేట గ్రామంలో మహిళా శక్తి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన మేనిఫెస్టోను తెలుగుదేశం పార్టీ ముందుకు వచ్చిందని రాబోయే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు లక్ష్మీదేవి, నాయకులు తోట శివయ్య, శ్రీనివాసులు, మండల నాయకులు డి సిద్దయ్య, తాటికొండ, ఉంగరాముడు, రామకృష్ణ, గ్రామ మహిళలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని టిడిపి మండల ప్రచార కార్యదర్శి ఎంవి శివరామిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని ఉమ్మాయపల్లె గ్రామంలో టిడిపి నాయకులు ప్రజా వేదిక నిర్వహించి అనంతరం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్ర మంలో నాయకులు గోపాల్ రెడ్డి, నాగిరెడ్డి, రామ్ నాయ క్, చిన్నోడు, శేఖర్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకుడు నాగేశ్వరరావు యాదవ్


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశిభూషన్

## ఆర్‌టిసి కార్గో సేవలను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి-డోన్**

ఆర్టీసీ ద్వారా అందించే కార్గో పార్సెల్ డోర్ డెలివరీ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించు కోవాలని డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్ సూచించారు. గురువారం డోన్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణంలో కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాల వాల్ పోస్టర్లను ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్ విడుదల చేశారు. డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలను పురస్కరించుకొని డోన్ డిపో గ్యారేజీ వద్ద ప్రారంభోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శశిభూషణ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్గో డోర్ డెలివరీ మాస ఉత్సవాలు నిర్వహిస్తుంటామని అందులో భాగంగా అక్టోబర్ 26 నుండి నవంబరు 25 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 నగరాలలో 10 కిలోమీటర్ల పరిధి వరకు 50 కిలోల బరువు వరకు ఉచిత డోర్ డెలివరీ అందిస్తున్నామని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్గో సిబ్బంది,కార్మికులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి : చైర్మన్

**ప్రజాశక్తి-డోన్**

మహిళలు ఆర్థికంగా ఎదగాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆకాంక్షించారు. గురువారం డోన్ పట్టణంలోని మెప్మా ఆధ్వర్య ములో మునిసిపల్ కాంప్లెక్స్ అవరణము నందు మహిళ పొదుపు సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తి ప్రదర్శన ప్రజల కొనుగోలు కొరకు మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి పొదుపు సంఘం సభ్యులతో వారి వ్యాపార వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ డోన్ పురపాలక సంఘము నందు మెప్మా ఆధ్వర్యంలో మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్ ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. వైసిపి ప్రభుత్వం పొదుపు సంఘం పట్టణ మహిళలకు తక్కువ వడ్డీకి అధిక రుణాలు ఇప్పిస్తూ మహిళ సాధికారత కొరకు తోడ్పాటుని స్తుందని పేర్కొన్నారు. రాబోవు రోజులలో డోన్ పట్టణములో పర్మినెంట్ గా రూమ్స్ కేటాయించి మహిళ సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, కొనుగోలు కేంద్రాలు నెలకొల్పడం జరుగుతుందన్నారు. పొదుపు మహిళలు ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేయడమే కాకుండా మెప్మా ద్వారా రాష్ట్ర స్థాయిలో అమెజాన్,ఫ్లిప్ కార్ట్, మొదలగు ఆన్లైన్ విక్రయ సంస్థల ద్వారా మెరుగైన మార్కెట్ సౌకర్యము కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టౌన్ మిషన్ కోర్డినేటర్ కె.సుజాత,డేటా ఎంట్రీ ఆపరేటర్ కె.రాము పట్టణ మహిళ సమైక్య ప్రెసిడెంట్ రాధమ్మ,రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.


స్టాల్స్ ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**- నవంబర్ 30 నాటికి పూర్తి కావాలి : కలెక్టర్**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నిరుపేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న లేఔట్లలో మంజూరై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నవంబర్ 30వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ హౌసింగ్ ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని విసి హాలులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెండింగులో ఉన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మంజూరై ప్రభుత్వం నిర్దేశించిన 23,995 ఇళ్ల నిర్మాణాల పూర్తి లక్ష్యానికి గాను నవంబర్ 30వ తేదీ నాటికి 13,903 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంజనీరింగ్ అధికారి రోజుకు 421 గృహాలు చొప్పున వివిధ నిర్మాణ దశల్లో పెండింగులో ఉన్న వాటిని సీరియస్‌గా తీసుకొని వేగవంతం చేయాలన్నారు. లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తప్పవన్నారు. పూర్తయిన గృహాలకు సోక్ పీట్‌ల నిర్మాణాలు కూడా వెంటనే చేపట్టాలని ఆదేశించారు. జగనన్న లేఔట్‌లో వెల్కమ్ ఆర్చిల నిర్మాణాలు ఎందుకు చేపట్టడం లేదని డిఇలను ప్రశ్నించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున వెల్‌కమ్ ఆర్చీలను ప్రారంభించి వెంటనే పనులు మొదలు పెట్టాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య, అన్ని మండలాల హౌసింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను మరింత చేరువ చేయాలి

**ప్రజాశక్తి - బేతంచర్ల**

ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను ఎస్‌హెచ్‌జిఎస్ మహిళలు పూర్తిస్థాయిలో అర్థము చేసుకునే విధంగా వివరించాలని డిఆర్డిఏ, ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ అడ్డాకుల సుధాకర్‌ను వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి కోరారు. డిఆర్డిఏ, ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా నూతనంగా బాధ్య తలు చేపట్టిన అడ్డాకుల సుధాకర్‌ను వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి వెలుగు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే మంచి గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య లీడర్ లక్ష్మీదేవి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## రూ. 1.25 కోట్లతో బెలుం బైపాస్ రోడ్డు

**- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి**

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

మండలంలోని బెలుం గ్రామ పరిధిలోని బెలుంగుహల సమీపం నుంచి బెలుం సింగవరం రోడ్డు వరకు రూ.1.25 కోట్లతో తారు రోడ్డు నిర్మించనున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన బెలుం బైపాస్ రోడ్డు ఏర్పాటు కోసం పరిశీలన చేశారు. పిఆర్ డిఈ నాగ శ్రీనివాసులతో కలిసి రోడ్డు నిర్మాణ సమయంలో ఎక్కడెక్కడ కల్వర్టులు నిర్మించాలని, రెండు కిలోమీటర్ల మేర కాలినడకన నడిచి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల బెలుం గ్రామ ప్రజలకు చాలా సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, నందిపాడు సర్పంచ్ గురువిరెడ్డి, బెలుం మహేశ్వర్ రెడ్డి, పిఆర్ ఏఈ అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఆయుధాలపై ఓపెన్ హౌస్

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

పోలీసుల ఆయుధాల ప్రదర్శన ఓపెన్ హౌస్‌ను కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీసు స్టేషన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఏటా అమరవీరులను స్మరించుకుంటూ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులతో అమరవీరుల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతో బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మహారాజ శ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ::
బనగానపల్లె
O.S. NO.144/2022
పల్లె ప్రతాప్ రెడ్డి. ...వాది
వర్సెస్
వెంకటన్న గారి బాలరాజు
వయస్సు 52. సం॥ తండ్రి వి.పెద్దయ్య,
వ్యాపారం, కునుకుంట్ల గ్రామం, ఔక్ మండలం,
నంద్యాల జిల్లా. ...ప్రతివాది
ప్రతివాది కి దావా సమన్లు
పై దావా నందు వాది , ప్రతివాది పై తన బాకీ మొత్తం రాబట్టుకోనుటకు దావా దాఖలు చేసి ఉండి. ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ.08-11-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజే యడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ.08-11-2023
ఇట్లు
దండు పుల్లన్న
వాది పరం అడ్వకేట్,
నంద్యాల.
సెల్ : 9951041492.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

నందికొట్కూరు పట్టణంలోని పారడైజ్ ఫంక్షన్ హాల్ నందు మిడుతూరు మండలం పైపాలెం గ్రామానికి చెందిన మానపాటి వెంకటయ్య కుమారుడి వివాహ వేడుకకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ గురువారం హాజరైయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులు వెంకటరమణ, వెంకట హేమలతలను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మండల నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి, జిల్లా యస్.సి విభాగం అధ్యక్షులు సగినెల వెంకటరమణ, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పైపాలెం షేక్ ఇనాయతుల్లా, తమడపల్లి విక్టర్, విశ్రాంత పోలీసు అధికారి పెరుమాళ్ళ జాన్, మారుతి నగర్ అయ్యన్న, దామగట్ల మాదవరం రత్నం, బిజినవేముల మహేష్, మల్యాల శంకరయ్య, టి. వెంకటస్వామి,గోల, తదితరులు పాల్గొన్నారు.

## 'పశుసంచార ఆరోగ్య సేవలు వరం'

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద పశు, గొర్రెల యజమానులకు వైయస్సార్ పసుపు సంచార ఆరోగ్య సేవలు వరం లాంటివని పశువైద్యాధికారి భువనేశ్వరి అంబులెన్స్ వైద్యులు ఇర్ఫాన్ తెలిపారు. గురువారం మండలంలోని శివపురం గ్రామంలో నరసింహనాయుడు గొర్రె పురిటి నొప్పులతో బాధపడుతుండగా గొర్రెను పరీక్షించి అంబులెన్స్ వాహనంలోనే అత్యవసర ఆపరేషన్ చేశారు. శివపురం గ్రామానికి చెందిన నరసింహుడు అనే గొర్రెల యజమానికి గొర్రె ఈనలేక మూడు రోజుల నుండి పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతుండడంతో వైయస్సార్ పశు సంచార ఆరోగ్య సేవకి సమాచారం ఇవ్వడంతో గొర్రెను పరీక్షించి అంబులెన్స్ వెహికల్‌లోనే ఎమర్జెన్సీ ఆపరేషన్ చేసి కుళ్ళిపోయిన పిల్లను బయటకి తీసివేయడం జరిగిందని పశు వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం వారు పోస్ట్ ఆపరేట్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు రామ్ చరణ్, తేజ, వైయస్సార్ పశుసంచార సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

ప్రకృతి వ్యవసాయంతో అధిక పంటలు దిగుమతులు సాధ్యమవు తాయని డిపిఎం సురేష్ అన్నారు. గురువారం నాడు స్థానిక వైయస్సార్ క్రాంతి పథకం సిబ్బందికి, రైతు సాధికార సమస్య సిబ్బందికి నిర్మించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం సలామ్, ఏసి పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి మండలంలో రైతు ఉత్పత్తి దారుల సంఘాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిఆర్‌డిఎ పిడి శ్రీధర్ రెడ్డి మాట్లా డుతూ ప్రకృతి వ్యవసాయంతో భూమి నిస్సారం కాకుండ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమమహేశ్వరం, సీసీలు లు వెంకటరమణ, జ్యోతి, శివమ్మ, నాగమణి, వెంకటరమణ, అకౌంటెంట్స్ మరియు రైతు సాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## 28న ఆలయాల మూసివేత

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ఈ నెల 28న చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ఆర్.కృష్ణాపురం సమీపంలో ఉన్న పుట్టాలమ్మ పరశురామలింగేశ్వర స్వామి దేవస్థానం, కొండపైన ఉన్న లక్ష్మి నరసింహ స్వామి ఆలయం మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో సాయి జయచంద్రారెడ్డి, చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయం మూసి వేయబడుతుందని, 29వ తేదీన ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల తర్వాత ఆలయాన్ని శుద్ధి చేసి భక్తులకు దర్శన అనుమతి కల్పిస్తామని పేర్కొన్నారు.

## పండ్ల తోటల పెంపకంతో లాభాలు

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

రైతులు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం సాగుచేసి అధిక లాభాలు పొందవచ్చని అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఉపాధి హామీ ఏపీఎం వసుధతో కలిసి ఈర్నపాడు గ్రామంలో రైతులు పెంచుతున్న పండ్లతో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది అంకితభావంతో పనిచేసే రైతులకు కూలీలకు సేవ చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఈసీ వరదరాజులు, మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మామిడి తోటల పెంపకంను పరిశీలిస్తున్న అంబుడ్స్ పర్సన్

## మహాసభను విజయవంతం చేయండి : ఎంఆర్‌పిఎస్

**ప్రజాశక్తి - చాగలమర్రి**

నవంబర్ 7న హైదరాబాద్‌లో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవ ంతం చేయాలని జిల్లా ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఎంఈఎఫ్ తాలుకా నాయకులు ఘనమద్దిలేటి, తిరుపతయ్యలు కోరారు. గురువారం మండలంలోని మల్లెవేముల గ్రామంలో విశ్వరూప మహాసభ గోడపత్రికలను విడుదల చేసారు. ఎంఆర్‌పిఎస్ గౌరవ అధ్యక్షుడు టిఎన్ఎల్ పుల్లయ్య, గ్రామ ఎంఎస్‌పి అధ్యక్షుడు చింతాకు బాల ఓబన్న,ఎంఆర్‌పిఎస్ నాయకులు నరసింహుడు , గడ్డ కిషోర్,రవి ప్రకాష్, నారాయణ, ఘన మద్దిలేటి, శ్రీనివాసులు, బాబు, ఓబులేసు, పుల్లయ్య, బాలుడు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ALLAGADDA MUNICIPALITY
***
Address : Ahobilam Road, Allagadda
Telephone No : 8978885220
E-mail id : mc.allagadda@cdma.gov.in
E-Tender: - Upgradation & Construction of CC Road & CC Drains
Tender Notification No. 08/GGMP/ALGM:Dated. 27-10-2023
Bid Document Download Start Date and Time : 27-10-2023 @ 10.00 AM
Bid Document Download End Date and Time : 10-11-2023 @ 04.00 PM
Bid Submission Closing Date and Time : 10-11-2023 @ 04.30 PM
E-Tender Website: https://tender.apeprocurement.gov.in/
E-Mail ID for Clarifications/Communication: mc.allagadda@cdma.gov.in
Note: Any addendum / corrigendum / bid clarifications/ time extension shall be issued on the website only. No separate press notification shall be issued.
Contact No: 8978885220 & 9398828017
Sd/-A.V Ramesh Babu
Commissioner
Allagadda Municipality

మహారాజ శ్రీ నంద్యాల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
ఓ.యస్.నెం.630/2020
యస్.రాజ నరసింహ రెడ్డి. ...వాది
వర్సెస్
1.కె.వెంకట సుబ్రహ్మణ్యం తండ్రి సుబ్రహ్మణ్యం,
ఇంటి నెం.3-53, బైర్మల్ వీధి,
నంద్యాల టౌన్ మరియు జిల్లా,
2.కె.కమల, భర్త కె.వెంకట సుబ్రహ్మణ్యం,
ఇంటి నెం. 3-53, బైర్మల్ వీధి,
నంద్యాల టౌన్ మరియు జిల్లా. ...ప్రతివాదులు
దావా సమన్లు
పై దావా నందు వాది, ప్రతి వాదులు అయిన మీ పైన దావా బాపత్తు మొత్తము రాగోరి కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. అందులో మీకు దావా సమన్లు ఎన్ని మార్లు పంపిన మీకు ముట్టనందున పై కోర్టు వారు పై కేసులో మీ హాజరు కొరకై 10-11-2023 వ తేదీన వాయిదా వేసి ఉన్నారు. పై అమలు దావా సంబంధించి, మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల 10-11-2023వ తేదీ ఉదయం 10,30 గంటలకు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకోవనలేను. లేనియెడల పై కోర్టు వారు మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేదీ: 10-11-2023
ఇట్లు
పుత్త రామక్రిష్ణ,
వాదిపరం అడ్వకేట్,
నంద్యాల జిల్లా,
సెల్ నెం.9440427307.
ఎన్రోల్మెంట్ No.Ap/1126/1988